సాక్షి వనపర్తి

మంగళవారం ॥ 21 ॥ జనవరి ॥ 2025



.. కళాశాలలకు జరిమానా

మిక్స్‌డ్ ఆక్యుపెన్సీ ప్రైవేటు జూనియర్ కాలేజీలకు ప్రభుత్వం రూ.లక్ష జరిమానా విధించింది.

వివరాలు 8లో ▸



.. బ్రహ్మోత్సవాలు

ఉమామహేశ్వర క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
36.3/15.0

వాతావరణం

ఉదయం, రాత్రి వేళలో చల్లటి గాలులు వీస్తాయి. చలి తీవ్రత పెరుగుతుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతం అవుతుంది.

న్యూస్‌రీల్

కల్యాణలక్ష్మి పేదలకు వరం



కొత్తకోట రూరల్: కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేదలకు వరమని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉన్న ప్రొ. జయశంకర్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. రాష్ట్రంలోని అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు తప్పకుండా నెరవేరుస్తామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి, రూ.500కే సిలిండర్, రూ.2 లక్షల పంట రుణ మాఫీ అమలుచేసి చూపించిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీకి పెరుగుతున్న ఆదరణ చూసి ప్రతిపక్ష నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. అనంతరం విలియంకొండలో గ్రామపంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. వ్యవసాయ మార్కెట్‌కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్, సీడీసీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, బోయేజ్, పి.కృష్ణారెడ్డి, వేముల శ్రీనివాస్‌రెడ్డి, డా. పీజే బాబు, మేస్త్రీ శ్రీనివాసులు, బీచుపల్లియాదవ్, ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి, పెంటన్నయాదవ్, సంద వెంకటేశ్, సలీంఖాన్, మోహన్‌రెడ్డి, ముజీబ్, మాజీ సర్పంచ్ విశ్వనాథం పాల్గొన్నారు.

ఫిబ్రవరి 5న దేశవ్యాప్త నిరసనలు

వనపర్తి రూరల్: కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలంటూ ఫిబ్రవరి 5న దేశవ్యాప్తంగా చేపట్టే నిరసన కార్యక్రమాల్లో యావత్ కార్మిక వర్గం పాల్గొనాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి సురేష్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కార్మికులతో కలిసి మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రూపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. బ్రిటీష్ కాలం నుంచి నేటి వరకు కార్మిక సంఘాలు అనేక పోరాటాలు చేసి సాధించుకున్న చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నాలుగు కోడ్లుగా విభజించి 44 కార్మిక చట్టాలను రద్దు చేసిందని మండిపడ్డారు. దీంతో కార్మికులు అనేక సంక్షేమాలకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్రతి ఐదేళ్లకు ఓసారి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు సవరణ చేయాల్సి ఉండగా.. అందుకు విరుద్ధంగా కనీస వేతనాలను కుదించే ప్రయత్నం చేస్తోందని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేస్తున్న పారిశుద్ధ్య,సెక్యూరిటీ, పేషెంట్‌కేర్ సూపర్‌వైజర్లను క్రమబద్ధీకరించి రూ.24 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గంజి శ్రీను, నర్సింహ, దర్గాస్వామి, కుమార్, ఆంజనేయులు, శ్రీకాంత్, శివ, మహేందర్, ప్రవీణ్, భాను, అనిల్ పాల్గొన్నారు.

ఆర్టిజన్ కార్మికుల రిలే దీక్షలు



వనపర్తి రూరల్: విద్యుత్‌శాఖలో 20 వేల మంది ఆర్టిజన్ కార్మికులు పనిచేస్తున్నారని.. వారి అర్హతల ఆధారంగా మార్పిడి చేయాలంటూ సోమవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా రిలే దీక్షలు ప్రారంభించారని టీవీఏసీ జేఏసీ నాయకుడు ఆనంద్‌గౌడ్ తెలిపారు. జిల్లాకేంద్రంలోని సర్కిల్ కార్యాలయం ఎదుట శిబిరం ఏర్పాటుచేసి టీవీఏసీ జేఏసీ నాయకులు ఆనంద్‌గౌడ్, రామ్, రమణ, నరహరి, అశోక్ దీక్షలో పాల్గొన్నారు. వీరికి యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (టీజీయూఈఈయూ), సీఐటీయూ జిల్లా నాయకుడు రామకృష్ణ వారికి పూలమాలలు వేసి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆర్టిజన్ కార్మికులు స్కిల్డ్ వర్క్ విధానంలో సుమారు 20 ఏళ్లుగా పని చేస్తున్నారని.. క్రమబద్ధీకరించాలని కోరారు.

6,614 క్వింటాళ్ల వేరుశనగ రాక

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డుకు సోమవారం 6,614 క్వింటాళ్ల వేరుశనగ విక్రయానికి వచ్చింది. క్వింటా గరిష్టంగా రూ.6,569, కనిష్టంగా రూ.4,029 ధర పలికింది. అలాగే కంది రూ.7,159–రూ.5,800, మొక్కజొన్న క్వింటా రూ.2,431, బెబ్బర్లు క్వింటా రూ.6,683, వరి ధాన్యం ఆర్‌ఎన్‌ఆర్ గరిష్టంగా రూ.2,590, కనిష్టంగా రూ.2,409, జొన్న క్వింటా రూ.4,143 ధరలు లభించాయి.

భవితతో మనోస్థైర్యం

ప్రత్యేక అవసరాల పిల్లలకు కేంద్రాలు



మున్ననూరు పాఠశాలలో పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు (ఫైల్)

- జిల్లాలో 16 కేంద్రాలు ఏర్పాటు.. 1,825 మంది చిన్నారుల గుర్తింపు
- సాధారణ విద్యార్థులతో పోటీపడేలా శిక్షణ
- ఫిజియో, స్పీచ్ థెరపీ శిబిరాలు

గోపాల్‌పేట: తెలంగాణ ప్రభుత్వం సమగ్రశిక్ష అభియాన్ పథకంలో భాగంగా 18 ఏళ్లలోపు ప్రత్యేక అవసరాల పిల్లలందరికీ సమ్మిళిత విద్య అందిస్తోంది. పుట్టుకతో వైకల్యం ఏర్పడి ఇబ్బందులు ఎదుర్కొంటున్న పిల్లల్లో మనోస్థైర్యం నింపేందుకు భవిత కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల్లో వారికి నిత్యకృత్యాలతో పాటు బోధన, స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ, కృత్యోపకరణాల వినియోగం మెళకువలు నేర్పిస్తున్నారు. ఇటీవల డీఎస్సీలో ఎంపికైన ప్రత్యేక ఉపాధ్యాయులు కేటాయించిన పాఠశాలల్లో పనిచేస్తూ అవసరమైన చిన్నారుల ఇళ్లకు వెళ్లి పాఠాలు బోధిస్తున్నారు.

సమ్మిళిత లేదా సహిత విద్య..

సాధారణ, ప్రత్యేక అవసరాల విద్యార్థులను కలిపి వారి స్థాయిలకు అనుగుణంగా బోధించే విద్యనే సమ్మిళిత లేదా సహిత విద్య అని అంటారు. 21 రకాల వైకల్యాల విద్యార్థులను ప్రత్యేక అవసరాల విద్యార్థులుగా గుర్తించారు. జిల్లాలో 1,825 మంది ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులను గుర్తించి వీరి కోసం 16 భవిత కేంద్రాలు ఏర్పాటు చేసి కొనసాగిస్తున్నారు. ఈ కేంద్రాల్లో ప్రత్యేక శిక్షణ పొందిన

ఇంటివద్దే బోధన..

భవిత కేంద్రాలకు సైతం రాలేని స్థితిలో ఉన్న మానసిక, శారీరక వైకల్యం కలిగిన విద్యార్థుల ఇళ్లకు ఈఆర్పీలు వెళ్లి బోధన అందిస్తారు. ప్రతి శనివారం నలుగురు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ప్రతి విద్యార్థికి గంట సమయం కేటాయించి వారి అవసరాలకు అనుగుణంగా వివిధ రకాల పద్ధతులను సూచిస్తారు. వారంలో ఒకరోజు ఫిజియో థెరపీ చేస్తారు. స్పీచ్ థెరపీ అవసరం ఉన్న విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ పొందిన ఫిజియో థెరపీస్ట్, స్పీచ్ థెరపీస్ట్ ద్వారా క్యాంపు నిర్వహిస్తారు. ఇందుకోసం జిల్లాలో ఇద్దరు ఫిజియో థెరపీస్టులు, ఇద్దరు స్పీచ్ థెరపీస్టులు పనిచేస్తున్నారు.

ఇంక్లూజివ్ ఎడ్యుకేషనల్ రిసోర్స్ పర్సన్స్ పనిచేస్తున్నారు. భవిత కేంద్రాల్లో స్కూల్ రెడీ న్యూస్ ప్రోగ్రాం అమలు చేస్తారు. ఇందులో ఆయా విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా బోధన అందించి సాధారణ విద్యార్థులతో పాటు పాఠశాలలో చేర్పించేలా తయారు చేయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం.

ఉచిత ఉపకరణాల పంపిణీ..

ప్రతి ఏటా ప్రత్యేక అవసరాల పిల్లలకు ఆర్టిఫిషియల్ మ్యానుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఉచిత ఉపకరణాల పంపిణీ చేస్తారు. 2023–24 విద్యా సంవత్సరంలో జిల్లాలో 128 మంది పిల్లలకు సుమారు రూ.పది లక్షల విలువైన ఉపకరణాలు అందించారు. అలాగే వైకల్యంతో బాధపడుతున్న విద్యార్థులకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది ఎంపవర్‌మెంట్ ఆఫ్ చిల్డ్రన్ విత్ ఇంటలెక్చువల్ డిజబులిటీ సహకారంతో టీఎల్‌ఎం కిట్స్ అందిస్తున్నారు. ఈ విద్యాసంవత్సరంలో జిల్లాలో 59 మంది విద్యార్థులకు టీఎల్‌ఎం కిట్లు పంపిణీ చేశారు. కేంద్రాలకు వచ్చే విద్యార్థులకు గ్రహణమొర్రిలాంటి చిన్న చిన్న శస్త్రచికిత్సలు కూడా ఉచితంగా చేయిస్తున్నారు.

సమాజంలో రాణించేలా ప్రోత్సాహం..



ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించేందుకు ఇంక్లూజిల్ ఎడ్యుకేషనల్ రిసోర్స్ పర్సన్ (ఐఈఆర్పీ) ద్వారా ఏటా జనవరి, జూలైలో సర్వే నిర్వహిస్తాం. వారిని భవిత కేంద్రాల్లో చేర్పించేలా ప్రయత్నం చేస్తాం. ప్రస్తుతం జిల్లాలో 16 కేంద్రాలు.. 1,825 మంది విద్యార్థులు ఉన్నారు. వారికి చదువుతో పాటు వారంలో ఒకరోజు ఫిజియోథెరపీ, స్పీచ్‌థెరపీ క్యాంపు, ప్రతి శనివారం ఐఈఆర్పీలు నలుగురు దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి విద్యా కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లు ప్రత్యేక అవసరాల విద్యార్థులను గుర్తించేందుకు సర్వే చేస్తున్నారు.

– యుగంధర్, ఐఈ కో–ఆర్డినేటర్



కొత్తకోట పాఠశాలలో విద్యార్థికి ఫిజియోథెరపీ చేస్తున్న సిబ్బంది (ఫైల్)

ప్రత్యేక అలవెన్సులు..

భవిత కేంద్రాలకు వచ్చే దివ్యాంగులకు రవాణా అలవెన్స్ కింద రూ.500, ఎస్కార్ట్ అలవెన్స్ కింద రూ.550, అమ్మాయిలకు ప్రతినెలా రూ.200 స్టైఫండ్‌ను ప్రభుత్వం ప్రతినెలా చెల్లిస్తోంది. దీంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం గతేడాది ఆరు నుంచి పదోతరగతి వరకు చదువుకుంటున్న 21 రకాల వైకల్యాలున్న విద్యార్థులందరికీ వారివారి వైకల్యాలను బట్టి వార్షిక పరీక్షల్లో చాలావరకు మినహాయింపులు ఇచ్చింది. మూగ, చెవుడు, అంధులు, మెడ సంబంధిత వ్యాధులు, బుద్ధిమాంద్యం, మస్తిష్క పక్షవాతం, అంగవైకల్యం, వెన్నముక సమస్యలు, గ్రహణమొర్రి, గ్రహణ చీలిక, మరగుజ్జులాంటి వారికి వార్షిక పరీక్షల్లో పది మార్కులకే ఉత్తీర్ణత పొందేలా ఉత్తర్వులు జారీ చేసింది. మిగతా ప్రత్యేక అవసరాల విద్యార్థులు 20 మార్కులు వస్తే ఉత్తీర్ణత పొందవచ్చు.

వరిసాగులో దేశంలోనే ప్రథమ స్థానం



డ్రోన్‌తో వరి విత్తనాలు వెదజల్లే విధానాన్ని చూస్తున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా. చిన్నారెడ్డి, ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా. చిన్నారెడ్డి

మదనాపురం: గతంలో ఎన్నడూలేని విధంగా ఈ ఏడాది రాష్ట్రంలో 56 లక్షల ఎకరాల్లో వరి సాగు చేసి దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచిన ఘనత తెలంగాణకు దక్కిందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని రామన్‌పాడులో డ్రోన్ సాయంతో వరి విత్తనాలు వెదజల్లే ప్రయోగాత్మక కార్యక్రమంలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, హైదరాబాద్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం వరి నాట్లు వేయడానికి స్థానికంగా కూలీలు దొరకక ఇతర రాష్ట్రాల నుంచి రప్పించే పరిస్థితి నెలకొందని, దీంతో పెట్టుబడి అధికమవుతుందని వివరించారు. ఇలాంటి తరుణంలో ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు మొట్టమొదటిసారిగా ఉమ్మడి పాలమూరులో డ్రోన్‌తో వరి విత్తనాలు వెదజల్లే పద్ధతికి శ్రీకారం చుట్టడం అభినందనీయమని కొనియాడారు. వ్యవసాయ నిపుణుల విజ్ఞప్తి మేరకు నియోజకవర్గంలో డ్రోన్లు ఆపరేట్ చేస్తున్న యువతకు తన సొంత నిధులతో లైసెన్స్‌లు ఇప్పిస్తానని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లెపాగ ప్రశాంత్, వేముల శ్రీనివాస్‌రెడ్డి, గిన్నె శ్రీనివాస్‌రెడ్డి, వడ్డె కృష్ణ, జగదీశ్, మహేష్, శ్రీధర్‌రెడ్డి, అంజద్‌అలీ, అక్కల మహాదేవన్‌గౌడ్, హనుమాన్‌రావు, టీసీ నాగన్నయాదవ్, రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ అబ్రహం లింకన్, కేవీకే శాస్త్రవేత్త మస్తానయ్య, వివిధ గ్రామాల రైతులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

- ఎస్పీ రావుల గిరిధర్



అర్జీదారుతో మాట్లాడుతున్న ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి: ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ రావుల గిరిధర్ కోరారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వారితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకోవాలని సూచించారు. శాంతిభద్రతలు పరిరక్షిస్తూ ప్రజలకు సేవలను మరింత చేరువ చేసేలా జిల్లా పోలీస్‌శాఖ పని చేస్తుందన్నారు. ప్రజా సమస్యలపై ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తూ ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కారిస్తున్నామని తెలిపారు. ప్రజావాణికి మొత్తం 11 ఫిర్యాదులు రాగా అందులో 4 భూ సమస్యలు, 5 పరస్పర గొడవలు, రెండు భార్యాభర్తల తగాదాలకు సంబంధించినవి ఉన్నట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు. పరిష్కారానికి ఫిర్యాదులను ఆయా ఠాణాల అధికారులకు పంపించామన్నారు.

'పోలింగ్ కేంద్రం స్థాయిలో గణతంత్ర వేడుకలు'



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు నారాయణ

వనపర్తి టౌన్: దశాబ్ద కాలానికి పైగా ప్రధాని మోదీ అందిస్తున్న సంక్షేమ పాలనే రాజ్యాంగానికి ప్రతీక అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దుప్పల్లి నారాయణ అన్నారు. జిల్లాలోని ప్రతి పోలింగ్ కేంద్రం స్థాయిలో గణతంత్ర వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు. సంవిధాన్ అభియాన్ కార్యశాలలో భాగంగా సోమవారం జిల్లాకేంద్రంలో పార్టీ నాయకులు, కార్యకర్తలకు నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధానిపై పార్లమెంట్ సాక్షిగా కాంగ్రెస్ విష ప్రచారాన్ని సృష్టించిందని.. దీనిని తిప్పికొట్టి వాస్తవాలను ప్రజలకు చేరువ చేసేందుకే పార్టీ అధినాయకత్వం సంవిధాన్ అభియాన్‌కు పిలుపునిచ్చిందని తెలిపారు. బీజేపీ పాలన రాజ్యాంగ మౌలిక సూత్రాలకు అనుగుణంగా ముందుకు సాగుతుండటంతోనే సామాన్య ప్రజలు అండగా నిలుస్తున్నారన్నారు. ఈ నెల 21 వరకు సంవిధాన్ కార్యశాలలు, 22, 23 తేదీల్లో దళిత, గిరిజన బస్తీల్లో నిద్ర, 24, 25 తేదీల్లో కళాశాలలు, వసతిగృహాల్లో సంవిధాన్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు సబిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీశైలం, చిత్తారి ప్రభాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి రామన్‌గౌడ్, నాయకులు, సుమిత్రమ్మ, పెద్దిరాజు, శివారెడ్డి, రాజశేఖర్‌గౌడ్, మధు తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రజని



అవగాహన కల్పిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రజని

వనపర్తి విద్యావిభాగం: మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రజని హెచ్చరించారు. సోమవారం జిల్లాకేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో లైంగిక వేధింపుల చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పనిచేసే చోట మహిళలను వేధిస్తే 2013 చట్టం ప్రకారం తీవ్ర చర్యలు ఉంటాయన్నారు. మహిళలను మాటలు, సైగల ద్వారా ఇబ్బందులకు గురి చేసినా చట్టపరంగా శిక్షార్హులవుతారని తెలిపారు. 10 మంది కలిసి పనిచేసే చోట మహిళా కార్మికులు అంతర్గత కమిటీలు ఏర్పాటు చేసుకొని రక్షణకు చొరవ చూపాలని సూచించారు. పాఠశాల హెచ్‌ఎం జి.గురురాజుయాదవ్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

గడువు పొడిగింపు

వనపర్తి: తెలంగాణ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఇందిరమ్మ మహిళాశక్తి పథకం కింద ఉచిత కుట్టుమిషన్ల పంపిణీ దరఖాస్తు గడువును ఈ నెల 25 వరకు పొడిగించినట్లు మైనార్టీ సంక్షేమశాఖ అధికారి ఎండీ అఫ్జలుద్దీన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన క్రైస్తవ మహిళలు TGOBMMS పోర్టల్‌లో దరఖాస్తు చేసుకొని సంబంధిత పత్రాలు జతచేసి జిల్లాకేంద్రంలోని మైనార్టీ సంక్షేమ కార్యాలయంలో అందించాలని పేర్కొన్నారు.

పలుగురాళ్ల గుట్టపై కవాతు నిర్వహిస్తాం



అక్రమ మైనింగ్ జరుగుతున్న ప్రాంతాన్ని గ్రామస్తులతో సందర్శించిన రాచాల

కొత్తకోట: గత ప్రభుత్వంలో మైనింగ్ పనులను దక్కించుకొని ప్రజా వ్యతిరేక పనులు చేస్తున్న ఆంధ్ర కాంట్రాక్టర్లను తరిమికొడదామని బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం పెబ్బేరు మండలం శాఖాపూర్ గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు గ్రామ శివారులోని పలుగురాళ్ల గుట్టను సందర్శించారు. గుట్టపై తవ్వుతున్న యంత్రాలు, పనులు చేస్తున్న సిబ్బందిని అనుమతులపై ఆరా తీశారు. మైనింగ్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడగా.. వారు సైతం సమాధానం దాటవేయడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పలుగురాళ్ల గుట్ట పశువుల మేతకు ఆధారంగా ఉంటుందని, పనులు ప్రారంభమైనప్పుడే ప్రజలు నిరసన వ్యక్తం చేశారన్నారు. బ్లాస్టింగ్ చేయడంతో ఇళ్లు దెబ్బతినడమే కాకుండా సమీప పొలాల్లో రాళ్లు, మట్టి పడి పంటలు నాశనమవుతున్నాయని, రైతులు సైతం బిక్కుబిక్కుమంటూ పొలాలకు వెళ్తున్నారని వివరించారు. గత పాలకులు చేసిన తప్పిదాలను ప్రజా ప్రభుత్వం కొనసాగించడం సహించరానిదన్నారు. వనపర్తి ఎమ్మెల్యే జోక్యం చేసుకొని కాంట్రాక్టు రద్దు చేయించి ప్రజలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కలెక్టర్ ఆదర్శ్‌సురభి, మైనింగ్ జిల్లా అధికారి గోవిందరాజు ను కలిసి తాటిపాములలో క్రషర్ యాజమాన్యం చేస్తున్న బ్లాస్టింగ్ వల్ల దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించాలని, అక్రమ మైనింగ్ నిర్వహిస్తున్న కాంట్రాక్టర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వనం తిరుపతయ్య యాదవ్, వజగౌని వెంకటన్న గౌడ్, బత్తుల జితేందర్ గౌడ్, అంజన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్‌లో ప్రతిభ చాటాలి



మాట్లాడుతున్న డీఐజీ ఎల్‌ఎస్ చౌహాన్

మహబూబ్‌నగర్ క్రైం: ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 1 వరకు కరీంనగర్‌లో జరిగే 3వ తెలంగాణ పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌కు ఎంపికైన పోలీస్ క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరచాలని జోగుళాంబ జోన్–7 డీఐజీ ఎల్‌ఎస్ చౌహాన్ అన్నారు. జిల్లాకేంద్రంలోని పరేడ్ మైదానంలో సోమవారం స్పోర్ట్స్ మీట్‌కు ఎంపికైన వారితో డీఐజీ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రాష్ట్రస్థాయితోపాటు జాతీయ స్థాయిలో మిమ్మల్ని మీరు నిలబెట్టుకునేందుకు మరింత కష్టపడాల్సిన అవసరం ఉందన్నారు. జోగుళాంబ జోన్ గర్వపడే విధంగా క్రీడల్లో ప్రతిభ చూపాలని కోరారు. పోలీస్ శాఖ అంటే చట్టాన్ని అమలు చేయడంతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని సూచించారు. క్రీడలతో మానసికోల్లాసం, శారీరక దృఢత్వం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్పీ జానకి, ఏఎస్పీలు రాములు, సురేష్‌కుమార్, నారాయణపేట ఏఆర్ ఏఎస్పీ రియాజ్ ఉల్‌హక్ తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికులకు మంచిరోజులు

ఇక నుంచి ఆన్‌లైన్ వేతన చెల్లింపులు

- జిల్లాలో 255 గ్రామపంచాయతీలు.. 1,080 మంది మల్టీపర్పస్ ఉద్యోగులు
- గతంలో ఎంపీడీఓల ద్వారా జమ



నాగర్‌కర్నూల్‌లో పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులు

అమరచింత: గ్రామపంచాయతీల్లోని మల్టీపర్పస్ ఉద్యోగులకు ఇక నుంచి నెలవారీ వేతనాలు ఆన్‌లైన్ ద్వారా చెల్లించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇంతవరకు గ్రామపంచాయతీ ఖాతాల్లో మిగులు ఆదాయం చూసి ఎంపీడీఓల ద్వారా వేతనాలు చెల్లించేవారు. దీంతో ప్రతినెల సకాలంలో వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడేవారు. ప్రస్తుత ప్రభుత్వం పంచాయతీ కార్మికుల సమస్యలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా కార్మికులకు వేతనాలు అందించాలని ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందుకుగాను గత నెలలోనే గ్రామ పంచాయతీల వారీగా కార్మికుడి వ్యక్తిగత బ్యాంకు ఖాతా, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్‌తో జాబితాను సిద్ధం చేసి జిల్లా పంచాయతీ అధికారికి, ఆ శాఖ కమిషనర్‌కు పంపించారు. ఇక వచ్చేనెల నుంచే వేతనాలు బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయనే ఆశల్లో కార్మికులు ఉన్నారు. ఇన్నాళ్లు సకాలంలో వేతనాలు అందక కుటుంబ పోషణ కోసం అప్పులు చేసిన పంచాయతీ కార్మికులు ప్రభుత్వ నిర్ణయంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి నెల రూ.9,500..

గ్రామపంచాయతీ కార్మికులకు ప్రభుత్వం ప్రతి నెల రూ.9,500 వేతనం చెల్లిస్తోంది. అదికూడా సకాలంలో అందకపోవడంతో సంఘం పరంగా ఉద్యమాలు చేపడుతూ వచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు గౌరవ వేతనం నెలకు రూ.21 వేలు చెల్లించాలని కార్మికులు కోరుతున్నారు.

సకాలంలో అందక ఇబ్బందులు..



గ్రామపంచాయతీ ఖాతాలో డబ్బులు లేవని నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. పలుమార్లు అధికారులకు విన్నవించగా గతేడాది నవంబర్ వరకు చెల్లించారు. ప్రభుత్వం జనవరి నుంచి వేతనాలు నేరుగా వ్యక్తిగత బ్యాంకు ఖాతాలో జమ చేస్తుందని చెప్పడం సంతోషంగా ఉంది.

– సురేశ్, పారిశుద్ధ్య కార్మికుడు, పాంరెడ్డిపల్లి

ట్రెజరీ ద్వారా చెల్లింపులు..



ప్రతినెల వేతనాలు సకాలంలో అందక ఎంపీడీఓ కార్యాలయం చుట్టూ తిరిగేవాళ్లం. ఎంపీడీఓ కార్యాలయంలో వేతనాల బిల్లు చేసి ట్రెజరీకి పంపేవారు. అక్కడి నుంచి అకౌంట్లోకి వేతన డబ్బులు జమయ్యేవి. ఇలా నాలుగు, ఐదు నెలలకొసారి వేతనాలు ఇచ్చేవారు. ఆన్‌లైన్‌లో వేతనాలు అందిస్తామని ప్రభుత్వం ప్రకటించడం ఆనందంగా ఉంది.

– మల్లేష్, పారిశుద్ధ్య కార్మికుడు, నాగల్‌కడ్మూర్

ఉన్నతాధికారులకు నివేదించాం..



పంచాయతీ కార్మికులకు క్రమం తప్పకుండా ప్రతినెల వేతనాలు అందించేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలోని 255 గ్రామపంచాయతీల్లో విధులు నిర్వర్తిస్తున్న కార్మికుల బ్యాంకు ఖాతా వివరాలను అందజేశాం.

– సురేశ్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి

క్లుప్తంగా

బస్సు డ్రైవర్ అజాగ్రత్తతో మహిళ మృతి


మణెమ్మ (ఫైల్)

నారాయణపేట రూరల్: ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతో ఓ మహిళ మృతిచెందిన ఘటన నారాయణపేట మండలం సింగారం క్రాస్‌రోడ్డు వద్ద సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. దామరగిద్ద మండలం వత్తుగుండ్ల గ్రామానికి చెందిన కారంపొడి మణెమ్మ (36) తన సోదరి కుమారుడిని సింగారం క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న (దామరగిద్ద) ఎస్సీ బాలుర గురుకుల పాఠశాలలో వదిలిపెట్టేందుకు వచ్చింది. అక్కడి నుంచి స్వగ్రామానికి వెళ్లేందుకు సింగారం సర్కిల్‌లో నారాయణపేట ఆర్టీసీ డిపోకు చెందిన అద్దె బస్సు ఎక్కడానికి రోడ్డు దాటుతుండగా.. డ్రైవర్ గమనించకుండా బస్సును ముందుకు కదిలించడంతో ముందు టైరు కింద పడి అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ భానుప్రకాష్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని జిల్లా మార్చురీకి తరలించారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కాగా, తమకు న్యాయం చేయాలంటూ బాధిత కుటుంబ సభ్యులు ఆర్టీసీ డిపో ఎదుట బైఠాయించారు. వారికి గ్రామస్తులతో పాటు వివిధ పార్టీలు, సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఆర్టీసీ డీఎం లావణ్య, విజిలెన్స్ ఎస్‌ఐ సమక్షంలో కుటుంబ సభ్యులతో మాట్లాడారు. న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రమాదవశాత్తు కిందపడి వ్యక్తి..

ధన్వాడ: రామాలయం శుభ్రం చేస్తూ ప్రమాదవశాత్తు పైనుంచి కింద పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని మందిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు.. మందిపల్లిలో రామాలయం నిర్మించి ఏడాది కావడంతో వార్షికోత్సవం కోసం ఆలయాన్ని శుభ్రం చేస్తున్నారు. వెంకటయ్య(40)తో పాటు మరో ముగ్గురు దేవాలయం పైకి ఎక్కి గోపురాన్ని శుభ్రం చేశారు. అనంతరం కిందకు దిగే క్రమంలో వెంకటయ్య ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. దీంతో తలకు తీవ్రగాయమైంది. హుటాహుటిన నారాయణపేట జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిశీలించిన డాక్టర్లు మార్గమధ్యలోనే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. అతడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. దేవాలయం నిర్మించినప్పటి నుంచి వెంకటయ్య నిర్వహణ బాధ్యతలు చూసుకునేవాడు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం

ఎర్రవల్లి: జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన ఇటిక్యాల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకటేష్ తెలిపిన వివరాలు.. మండలంలోని బీచుపల్లి హైవే బస్టాప్ దగ్గర ఆదివారం రాత్రి కర్నూల్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఓ వాహనం గుర్తుతెలియని వ్యక్తిని ఢీకొట్టింది. ఈప్రమాదంలో అతడికి తీవ్రగాయాలు కాగా అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. స్థానికులు గమనించిన పోలీసులకు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని గద్వాల ఆస్పత్రికి తరలించారు. మృతుడి వయస్సు సుమారు 40–45ఏళ్లు ఉంటాయని, కుడిచేతికి ఆకుపచ్చ దారం, ఎరుపు అంగీ, బ్లూ కలర్ పంచ ధరించినట్లు ఎస్‌ఐయ తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు ఇటిక్యాల పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

విద్యుదాఘాతంతో పంచాయతీ కార్మికుడు మృతి



మాగనూర్: మండలంలోని నేరడగం గ్రామంలో పంచాయతీ కార్మికుడిగా పనిచేస్తున్న సాయిలు(40) ఇంట్లో సెల్‌ఫోన్ చార్జింగ్ పెడుతూ పక్కనే ఉన్న విద్యుత్ వైర్‌ను పట్టుకుని విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. నేరడగం గ్రామపంచాయతీలో సాయిలు ట్రాక్టర్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం పనులు ముగించుకొని ఇంటికివెళ్లి సెల్‌ఫోన్ చార్జింగ్ పెడుతున్న క్రమంలో పక్కనే ఉన్న ఫ్యాన్ వైర్‌ను మరో చేతితో పట్టుకోగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అంతకు ముందు మాగనూర్ ఇన్‌చార్జీ ఎంపీవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో ప్రభుత్వం నుంచి మృతుని అంత్యక్రియల నిమిత్తం రూ.10వేలు అందజేశారు.

ముగ్గురికి రిమాండ్

చిన్నచింతకుంట: మండలంలోని మద్దూర్ గ్రామంలో జరిగిన దాయాదుల ఘర్షణలో ముగ్గురిని రిమాండ్ చేసినట్లు ఎస్‌ఐ ఆర్.శేఖర్ తెలిపారు. నెలరోజుల క్రితం గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు వెంకటన్న, భాగ్యమ్మపై వారి దాయాదులు సద్దలి అంజన్న, సద్దలి సంజీవ, అనిల్ దాడిచేసి గాయపర్చారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని.. నిందితులను సోమవారం మహబూబ్‌నగర్ కోర్టులో హాజరు పరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రైవేట్ కళాశాలలకు జరిమానా



ఉమ్మడి జిల్లాలో మిక్స్‌డ్ ఆక్యుపెన్సీ ఉన్న వాటికే..

- రూ.లక్ష చెల్లిస్తేనే గుర్తింపునిచ్చే అవకాశం
- సందిగ్ధంలో యాజమాన్యాలు, విద్యార్థులు
- ప్రభుత్వ కళాశాలల నుంచి అనుమతించే యోచనలో ప్రభుత్వం



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలోని మిక్స్‌డ్ ఆక్యుపెన్సీ ఉన్న ప్రైవేటు జూనియర్ కళాశాలలు గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నాయి. ప్రతిఏటా ప్రవేశాలు తగ్గుముఖం పడుతుండగా.. తాజాగా సంవత్సర గుర్తింపు రాకపోవడం మరో సమస్యగా మారింది. ప్రధానంగా మిక్స్‌డ్ ఆక్యుపెన్సీ భవనాల్లో కొనసాగుతుండటం, ఫైర్ సేఫ్టీ అనుమతులు రాకపోవడం విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి ఇబ్బందిగా మారింది. ప్రభుత్వం నేడో రేపో అనుమతులు ఇవ్వకపోదా అని యాజమాన్యాలు ఇన్ని రోజులు ఎదురుచూసినా.. చివరకు పరీక్షలు సమీపిస్తున్న సమయంలో నిరాకరించడంతో పాటు విద్యార్థులను పరీక్షలకు అనుమతించాలంటే రూ.లక్ష చెల్లించాలంటూ కళాశాలల లాగిన్‌లో చూపిస్తున్నట్లు యాజమాన్యాలు పేర్కొంటున్నాయి. కళాశాలల నిర్వహణ, భవనాల అద్దెలు భారంగా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో డబ్బులు చెల్లించలేమని.. ప్రభుత్వంతో మరోదఫా చర్చలు జరపాలని భావిస్తున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గుర్తింపురాని కళాశాలలు 21 ఉండగా అందులో మహబూబ్‌నగర్ 14, వనపర్తి 4, నారాయణపేట 2, నాగర్‌కర్నూల్ 1 ఉన్నాయి. వీటిలో ఎక్కువగా ఒకేషనల్ జూనియర్ కళాశాలలు ఉండగా.. సుమారు 5,600 మంది విద్యార్థులు చదువుతున్నట్లు తెలుస్తోంది.

ప్రభుత్వ కళాశాలల నుంచి పరీక్షలు..

గుర్తింపు లేని కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నష్టం వాటిల్లకుండా ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 31 నుంచి ప్రాక్టికల్ పరీక్షలు, మార్చి 5 నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. కావున ఆయా విద్యార్థులు సమీప ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పరీక్ష ఫీజు చెల్లించే వెసులుబాటు కల్పిస్తుందని ఇంటర్మీడియట్‌శాఖలో చర్చ నడుస్తోంది. ఆయా కళాశాలల నుంచి హాల్‌టికెట్లు, మెమోలు జారీ చేసే అవకాశం ఉంది.

అనుమతులివ్వాలి..

హైదరాబాద్‌లో కొనసాగే కార్పొరేట్ కళాశాలల మాదిరిగా జిల్లా, మండల కేంద్రాల్లోని కళాశాలలను పోల్చడం ఇబ్బందికరమైన విషయం. చాలామంది నిరుద్యోగ యువత కేవలం ఉపాధి కోసమే కళాశాలలు నిర్వహిస్తున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ఎలాంటి అదనపు ఫీజులు లేకుండా ప్రభుత్వం అనుమతి ఇవ్వాలి. పరీక్ష ఫీజులు కూడా చెల్లించేలా చర్యలు తీసుకోవాలి.

– విజేత వెంకట్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు, ప్రైవేటు కళాశాలల సంఘం, మహబూబ్‌నగర్

రూ.లక్ష జరిమానా విధించారు..



మిక్స్‌డ్ ఆక్యుపెన్సీ ఉన్న కళాశాలలకు ప్రభుత్వం గుర్తింపు ఇవ్వలేదు. ఉమ్మడి జిల్లాలో 14 కళాశాలలు ఉండగా.. ప్రభుత్వం ఒక్కో కళాశాలకు రూ.లక్ష జరిమానా విధించింది. వీటిలో అడ్మిషన్లు తీసుకున్న విద్యార్థులు పరీక్ష ఫీజుపై అదనంగా రూ.2,500 చెల్లించాలని సూచించింది. ఫీజులు చెల్లించని విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. గుర్తింపు ఉన్న కళాశాలల నుంచి పరీక్ష ఫీజులు వసూలు చేసి పరీక్ష రాయించే అవకాశం ఉంది. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలకు సిద్ధంగా కావాలి.

– కౌసర్ జహాన్, జిల్లా ఇంటర్మీడియర్‌శాఖ అధికారి, మహబూబ్‌నగర్

విద్యార్థులకు భారం..

గత విద్యాసంవత్సరంలో ప్రభుత్వం కళాశాలలకు అనుమతులు ఇచ్చింది. గతేడాది కళాశాలలో చేరి రెండో సంవత్సరం పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేవు. ఈ విద్యాసంవత్సరం మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు సమస్యగా మారింది. ప్రభుత్వం వీరు చేరిన కళాశాలలకు గుర్తింపునివ్వకపోవడంతో పరీక్ష ఫీజులు తీసుకోలేదు. ఇటీవలే పరీక్ష ఫీజు గడువును ఈ నెల 25కు పొడిగించింది. సాధారణంగా పరీక్ష ఫీజు రూ.750 ఉండగా.. జరిమానా రూ.2,500 కలిపి చెల్లించాలని ప్రభుత్వం నిబంధన విధించింది. సాధారణ ఫీజు విద్యార్థులు చెల్లించాని జరిమానా ఎవరు చెల్లించాలనేది ప్రశ్నగా మారింది. వీటితో పాటు ప్రైవేటు కళాశాలల్లో చదివే విద్యార్థులు సాధారణంగా రూ.200 చెల్లించాల్సి ఉంది. కానీ రూ.500 ఒక్కో విద్యార్థికి చెల్లించాలని ప్రభుత్వం సూచించింది.

సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తికి రిమాండ్


మాట్లాడుతున్న సీఐ దస్రునాయక్

కోస్గి రూరల్: సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీని, పోలీసులను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన కేసులో వ్యక్తిని పట్టుకొని రిమాండ్ తరలించినట్లు సీఐ దస్రునాయక్ తెలిపారు. సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మండలంలోని సర్జఖాన్‌పేటకి చెందిన కృష్ణయ్యగౌడ్ ఈనెల 9న హైదరాబాద్‌లో సీఎం, కాంగ్రెస్ పార్టీ, పోలీస్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ వీడియో తీశాడు. దాన్ని సోషల్ మీడియాలో వైరల్ చేశాడు. సర్జఖాన్‌పేట్ మాజీ సర్పంచ్ హరీష్‌గౌడ్ గ్రామస్తులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈనేపథ్యంలో ఈనెల 11న కేసు నమోదు చేసి సోమవారం అరెస్ట్ చేసి మేజిస్ట్రేట్ ముందు హాజరు పర్చగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు. ఎస్‌ఐ బాల్‌రాజ్, పోలీసులు ఉన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో.. రైతు ఆత్మహత్యాయత్నం


బాధిత రైతుతో మాట్లాడుతున్న తహసీల్దార్ కృష్ణయ్య

దేవరకద్ర రూరల్: తన పట్టా పొలంలో అక్రమంగా వేస్తున్న రోడ్డు పనులను నిలిపివేయాలని ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఓ రైతు ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించిన సంఘటన సోమవారం దేవరకద్ర తహసీల్దార్ కార్యాలయంలో చోటుచేసుకుంది. వివరాలిలా.. మండలంలోని చౌదర్‌పల్లికి చెందిన రామకృష్ణకు గ్రామంలోని సర్వే నం.88లో 6.6 ఎకరాల పట్టా భూమి ఉంది. అందులో నుంచి పై పొలాలకు వెళ్లేందుకు తన అనుమతి లేకుండా దారి కోసమని కొందరు మట్టి రోడ్డు వేస్తున్నారని, అడిగిన తనపై దాడి చేశారని, ఈ విషయమై పోలీసులు, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ క్రమంలోనే సోమవారం బాధిత రైతు తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకొని ఒంటిపై పెట్రోల్ పోసుకుంటుండగా అక్కడే ఉన్న ప్రజలు అడ్డుకున్నారు. దీంతో న్యాయం కోసం కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఈ విషయమై స్పందించిన తహసీల్దార్ కృష్ణయ్య మాట్లాడుతూ ఈ విషయం తన దృష్టికి ఇప్పటి వరకు రాలేదని, మోకపైకి వచ్చి పూర్తి వివరాలు పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో బాధిత రైతు ఆందోళన విరమించారు.

పురుగు మందు తాగి వ్యక్తి బలవన్మరణం


మురళీకృష్ణ(ఫైల్)

కల్వకుర్తి టౌన్: తాను నిత్యం తాగే మందులో పురుగు మందు కలుపుకొని తాగి వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ మాధవరెడ్డి, కుటుంబీకులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీలో నివాసముండే మురళీకృష్ణ(46) ప్రైవేట్ సీడ్ కంపెనీలో ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తూ తన జీవనాన్ని సాగించేవాడు. అతను తరచూ నెలలో రెండు, మూడు రోజులు అతిగా మద్యం తాగి ఎక్కడపడితే అక్కడ పడిపోయేవాడు. రోజు మాదిరిగానే ఆదివారం రాత్రి ఇంట్లో నుంచి బయలుదేరిన అతను మద్యాన్ని కొనుగోలు చేసి, అందులో తన వద్ద ఉన్న పురుగుమందును కలుపుకొని తాగాడు. ఇంటికి సమీపంలో ఉన్న వేంకటేశ్వరస్వామి దేవాలయం వెనక భాగంలో పడిఉన్నాడు. ఉదయాన్నే అటుగా వెళ్తున్నవారు చూసి కుటుంబసభ్యులకు సమాచారమివ్వగా, వారు వచ్చి చూసేసరికి అప్పటికే మృతిచెందాడు. కుటుంబీకులు పోలీసులకు సమాచరమివ్వగా వారు ఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో నగదు చోరీ

మరికల్: ఆర్టీసీ బస్టాండ్‌లో ఓప్రయాణికుడి జేబులో ఉన్న రూ. లక్ష నగదును చోరీచేసిన ఘటన మరికల్‌లో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. నర్వ మండలం మదన్‌కోడ్‌కి చెందిన రామచందర్ బంధువుల వద్ద చేసిన అప్పును తీర్చడం కోసం ఇంటి నుంచి రూ. లక్ష నగదు తీసుకొని ఆటోలో మరికల్ బస్టాండ్‌కు వచ్చారు. ఇక్కడి నుంచి కొల్లంపల్లిలో ఉన్న బంధువుల వద్దకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు ఎక్కాడు. ఈ క్రమంలో అతడి జేబులో ఉన్న డబ్బులను గుర్తుతెలియని దుండగులు చోరీ చేశారు. బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాము తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో..

వనపర్తి రూరల్: పట్టణంలోని కేడీఆర్‌నగర్ కాలనీలో తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని కేడీఆర్ కాలనీకి చెందిన మనోహర్‌రావు ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 18న హైదరాబాద్‌కు వెళ్లాడు. సోమవారం వనపర్తికి తిరిగి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటంతో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారని గుర్తించారు. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బీరువా తాళాలు పగులగొట్టి అందులో దాచిన రూ.75 వేల నగదు ఎత్తుకెళ్లారని బాధితుడు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



హ్యాండ్‌బాల్‌లో కాంస్యం

కరీంనగర్‌లో ఈనెల 18 నుంచి సోమవారం వరకు జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ అంతర్ జిల్లా హ్యాండ్‌బాల్ టోర్నీలో ఉమ్మడి జిల్లా బాలుర జట్టు మెరుగైన ప్రతిభ కనబరిచి మూడోస్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని అందుకుంది. ఈ సందర్భంగా జట్టును సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ తఖీయోద్దీన్, శంకర్‌నాయక్ అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

– మహబూబ్‌నగర్ క్రీడలు

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


చంద్రశేఖర్‌రెడ్డి (ఫైల్)

మానవపాడు: అప్పులబాధతో రైతు పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన మానవపాడు మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ చంద్రకాంత్, కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. మానవపాడుకు చెందిన రైతు చంద్రశేఖర్‌రెడ్డి (32) తనకున్న ఆరెకరాల పొలంలో పొగాకు, కందిపంట సాగుచేశారు. పంట పెట్టుబడి, కుటుంబ అవసరాల నిమిత్తం రూ. 6లక్షల దాక అప్పులు చేశారు. అయితే చేసిన అప్పులు తీర్చే దారి లేకపోవడం, వడ్డీ భారం ఎక్కువ కావడంతో మనస్థాపానికి గురై వ్యవసాయ పొలంలో పురుగు మందు తాగాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో చికిత్స నిమిత్తం మానవపాడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అలంపూర్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అతడికి భార్య హారిక, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైస్‌మిల్లుల్లో ఆకస్మిక తనిఖీలు

- పీడీఎస్ బియ్యం లారీ పట్టివేత
- సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగింత

గద్వాల క్రైం: మండలంలోని ఓ రైస్ మిల్లులో గద్వాల పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టి.. మిల్లులో అనుమానాస్పదంగా ఉన్న పీడీఎస్ బియ్యం లారీని గుర్తించిన సంఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ శ్రీను కథనం ప్రకారం.. మండలంలోని ఓ రైస్ మిల్లులో పీడీఎస్ బియ్యం రీసైక్లింగ్ చేస్తున్నట్లు ఫిర్యాదుల నేపథ్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించరన్నారు. ఓ లారీలో రీసైక్లింగ్ చేసిన బియ్యం తరలిస్తున్నట్లు అనుమానం మేరకు సదరు లారీని అదుపులోకి తీసుకుని సివిల్ సప్‌లై శాఖ అధికారులకు అప్పగించారు. ఆ శాఖ అధికారులు పరిశీలించి పీడీఎస్ బియ్యం రీసైక్లింగ్ చేసినట్లు ధృవీకరిస్తే చర్యలు ఉంటాయన్నారు. ప్రస్తుతం విచారణ చేస్తున్నామని, వివరాలు త్వరలో వెల్లడిస్తామన్నారు.

● ఇదిలా ఉండగా.. కొన్ని రోజుల నుంచి సంబంధిత రైస్‌మిల్లు యజమానికి ప్రభుత్వం కేటాయించిన ధాన్యం ఆరుబయటే నిల్వ ఉంచినట్లు తనిఖీల్లో వెల్లడైందని తెలుస్తుంది. ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో రైస్ మిల్లు యజమానులపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేకుండా పోయాయి. దీంతో నడిగడ్డలో నిత్యం వందలాది క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారు. పోలీసుల తనిఖీలో పట్టుబడిన సమయంలో మాత్రమే కేసులు నమోదు చేస్తున్నారు.

విచారణ జరుపుతాం..

పట్టుబడిన బియ్యం లారీని గద్వాల పోలీసులు మా దృష్టికి తీసుకువచ్చారు. అయితే ప్రస్తుతం గద్వాల మార్కెట్ యార్డ్‌లోని స్టాక్ పాయింట్ వద్దకు తరలించారు. పట్టుబడిన బియ్యం పీడీఎస్ లేదా రీసైక్లింగ్ చేసిన బియ్యం అనే విషయమై విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం. – మహర్షి, సివిల్ సప్లయ్ శాఖ అధికారి

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు


ఉమా మహేశ్వరంలో స్వామివారి పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు


పాపనాశిని గుండం వద్ద చక్రస్నానం

అచ్చంపేట: శ్రీశైలం ఉత్తర ద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మూడోరోజు సోమవారం అర్చకుడు వీరయ్యశాస్త్రి ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, వసంతోత్సవం, చక్రస్నానం, పాపనాశనం వద్ద త్రిశూల స్నానాలు, పల్లకీసేవ నిర్వహించారు. భక్తులు పాపనాశిని గుండం వద్ద పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే ఆలయంలో ఉదయం గవ్యంత పూజలు, వాస్తుపూజ, వాస్తుహోమంతో పాటు అమ్మవారికి కుంకుమార్చన చేశారు. వేడుకలను ఆలయ కమిటీ చైర్మన్ బీరం మాధవరెడ్డి, కార్యనిర్వహణ అధికారి శ్రీనివాసరావు పర్యవేక్షిస్తున్నారు. దర్గా వద్ద నుంచి గ్రామపంచాయతీ, ఉమమహేశ్వరం ద్వారం వరకు కాలినడకన భక్తులు తప్పా ఇతర వాహనాలను అనుమతించడం లేదు.

రంగాపురం ఉర్సులో..

రంగాపురం నిరంజన్ షావలీ ఉర్సు ఘనంగా కొనసాగుతోంది. సోమవారం భక్తులు కందూర్లు చేసి ఫాతేహాలిచ్చి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. దర్గా ఆవరణలో ఏర్పాటు చేసిన దుకాణాల్లో రద్దీ కనిపించింది.

దర్గాలో భక్తుల రద్దీ →



జాతీయ వైద్యబృందం పరిశీలన


సీహెచ్‌సీలో బ్లడ్‌బ్యాంకును పరిశీలిస్తున్న కేంద్ర బృందం, డీఎంహెచ్‌ఓ, ఆస్పత్రి అధికారులు

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని సీహెచ్‌సీని జాతీయ జనాభా పరిశోధన కేంద్ర బృందం తనిఖీ చేశారు. సోమవారం సాయంత్రం ఆస్పత్రికి చేరుకున్న తమిళనాడుకు చెందిన వైద్యులు కవిత, శక్తి మాళవిక బృందం రాత్రి వరకు రోగులకు అందిస్తున్న సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోగుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే వివరాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రిలో డెలివరీ తర్వాత ఇచ్చే జీరో డోస్, మాతా, శిశు మరణాల రేటు, వచ్చే రోగులకు సరిపడా సిబ్బంది వివరాల, బ్లడ్‌బ్యాంకులో ఉన్న రక్తనిల్వలపై వివరాలను ఆరాతీశారు. అనంతరం ఆస్పత్రిలోని అన్ని విభాగాలను వారు నిశితంగా పరిశీలించారు. కేంద్ర బృందం వెంట డీఎంహెచ్‌ఓ స్వరాజ్యలక్ష్మీ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ భీమానాయక్, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ శివరాం, వైద్యులు యశోద బాయి, విష్ణు, శివ, స్వప్న, నర్సింగ్ సూపరింటెండెంట్ శిరోమణి, నర్సింగ్ సిబ్బంది జాయ్‌మెర్సీ, బాలమణి, సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

పల్లె దవాఖానా తనిఖీ..

వెల్దండ: మండలంలోని కొట్ర గ్రామంలో పల్లె దవాఖానాను సోమవారం కేంద్ర వైద్య బృందం ఆకస్మికంగా తనిఖీ చేసింది. ఈసందర్భంగా ఆస్పత్రిలోని వైద్యసేవల పనితీరు, అందుబాటులో ఉన్న మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం పల్లె దవాఖానాల ద్వారా గ్రామీణులకు మెరుగైన వైద్యం అందించడానికి కృషి చేస్తున్నట్లు ఆబృందం సభ్యులు పేర్కొన్నారు. అనంతరం కేంద్ర వైద్య బృందానికి ఇక్కడి సిబ్బంది శాలువాలతో ఘనంగా సన్మానించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ భీమానాయక్, డాక్టర్లు మంజుభార్గవి, నవీన్‌కుమార్, సూపర్‌వైజర్లు మురళీకృష్ణ, సుమిత్ర, కవిత, ఏఎన్‌ఎంలు జాహంగీర్‌బీ, జానకి, ఎల్లమ్మ, ఫార్మసిస్టు అనిత, ఆశావర్కర్లు మంగమ్మ, లక్ష్మీబాయి, రాణిబాయి, శ్రీదేవి, పద్మ, సాయమ్మ తదితరులున్నారు.

మున్సిపల్ కార్యాలయానికి తాళం వేసి నిరసన


కార్యాలయానికి తాళం వేసి నిరసన వ్యక్తం చేస్తున్న కౌన్సిలర్లు

భూత్పూర్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయానికి బీఆర్‌ఎస్ మున్సిపల్ కౌన్సిలర్లు సోమవారం తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్న సురేందర్‌రెడ్డి మూడు నెలల కిందట బదిలీ కాగా జడ్చర్ల మున్సిపల్ కమిషనర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. అయితే ఆయన ఎప్పుడు వస్తున్నారో.. ఎప్పుడు వెళ్తున్నారో తెలియడం లేదని, మున్సిపాలిటీలో సమస్యలు పేరుకుపోతున్నా కమిషనర్ పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ కార్యాలయానికి తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. వీధిలైట్లు, పారిశుద్ధ్య సమస్య వేధిస్తుండటంతోపాటు ట్రాక్టర్ మరమ్మతుకు గురైనా బాగు చేయించడం లేదని ఆరోపించారు. దీంతో మొక్కలకు నీళ్లు పోయడం లేదని, పార్కు ఎండిపోతోందని కౌన్సిలర్లు ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్ మేనేజర్ శంకర్‌నాయక్‌తో మాట్లాడి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణ, జాకీర్, మురళీధర్‌గౌడ్, సత్యనారాయణ, యాదయ్య తదితరులున్నారు.